విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 23 మార్చి 2024 8 పేజీలు

ఒంగోలు పార్లమెంట్, దర్శి పెండింగ్

- టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ
- పరిశీలనలో పలు పేర్లు
- టీడీపీ మూడో జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో 11 అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీచేసే అభ్యర్థులతో పాటు 13 పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల మూడవ జాబితాను శుక్రవారం ప్రకటించారు. ఈ జాబితాలో ఒంగోలు పార్లమెంట్‌తో పాటు దర్శి అసెంబ్లీ నుంచి అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టింది. ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి మాగుంట రాఘవరెడ్డి పేరు దాదాపు ఖరారు అయినప్పటికీ శుక్రవారం ప్రకటించిన మూడవ జాబితాలో ఆ పేరు లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దర్శి మాత్రం అందరూ ఊహించినట్లే అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాకపోవడంతో అసెంబ్లీ అభ్యర్థులు పోటీచేసే జాబితాలో దర్శి నియోజకవర్గానికి చోటు దక్కలేదు. మొత్తం మీద రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాదాపు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మినహా మిగిలిన అభ్యర్థులను ప్రకటించింది. నిన్నటి వరకు పెండింగ్‌లో ఉన్న చీరాల నియోజకవర్గం నుంచి ఎంఎం కొండయ్య పేరు కూడా ప్రకటించి ఆ నియోజకవర్గంలో ఉత్కంఠకు తెరదించింది. ఇక దర్శి నియోజకవర్గం నుంచి రోజుకో కొత్తపేర్లు వినిపిస్తున్నాయి. తాజాగా దామచర్ల సత్య పేరు కూడా తెరమీదకు వచ్చింది. దామచర్ల కుటుంబం మొదటి నుంచి టీడీపీకి విధేయతగా ఉంది. దామచర్ల ఆంజనేయులు మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత దామచర్ల జనార్ధన్ తెలుగుదేశం పార్టీ తరపున ఒంగోలు నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చేశారు. కొండేపీ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో ఆ నియోజకవర్గం బాధ్యతలన్నీ దామచర్ల కుటుంబంకు కేటాయించారు. ప్రస్తుతం కొండేపి నియోజకవర్గం మొత్తాన్ని దామచర్ల సత్య చూసుకుంటున్నారు. పేరుకు ఎమ్మెల్యేగా స్వామి ఉన్నప్పటికీ రాజకీయంగా చక్రం తిప్పేది దామచర్ల కుటుంబమే. అలాంటి కుటుంబం నుంచి యువనాయకుడిగా ఎదిగిన దామచర్ల సత్యాను కూడా దర్శి నుంచి బరిలో దించితే ఎలా ఉంటుందన్న ఆలోచనలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. అంతకుముందు మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు, గరికపాటి వెంకట్, గోరంట్ల రవికుమార్, శ్రీలక్ష్మి, మద్దిశెట్టి వేణుగోపాల్ ఇలా రోజుకోపేరు వినిపిస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. పోటీలో ఎవరైతే బాగుంటుంది అనే అంశంపై ఆ పార్టీ రకరకాల సర్వేలు నిర్వహిస్తుంది. దీంతో దర్శి నియోజకవర్గం అభ్యర్థి ఎవరన్నది ఉత్కంఠగానే మారింది. ఇదిలా ఉంటే ఒంగోలు పార్లమెంట్ నుంచి మాగుంట రాఘవరెడ్డి పేరు దాదాపు ఖరారు అయినప్పటికీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందరి దృష్టి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్‌పైనే ఉంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. గతవారం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ కుమార్తె కవితను అరెస్ట్ చేశారు. అదే కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవరెడ్డి పేరు ఉంది. దీంతో లిక్కర్ స్కాం కేసు పరిణామాల నేపథ్యంలో మాగుంట రాఘవరెడ్డి పేరును ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతుంది. మొత్తంమీద ఎన్నికల - మిగతా 2 లో

యువత భవితను చిధిమేస్తున్న జగన్ డ్రగ్ మాఫియా

- విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారు
- డ్రగ్స్‌పై సమగ్రవిచారణ జరపాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని

6లో

8లో

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

బీజేపీ కుటిలనీతికి ప్రజలే బుద్ధి చెబుతారు

8లో

- ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం
- ఆప్ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్

ప్రజల బాధను కళ్లారా చూశా..

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

2 లో..

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- జిల్లాలో 9021 మందిపై బైండోవర్‌లు
- రూ 2.45 కోట్ల నగదు స్వాధీనం
- 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సెక్టార్ ఆఫీసర్స్ బృందాలతో నిరంతర నిఘా
- జిల్లా సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు
- మీడియాతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించ డమే లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికల గురించి తీసుకున్న చర్యలను గురించి జిల్లా ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 137 లైసెన్సు తుపాకీలు ఉండగా వాటిలో 75ని ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని,మిగిలిన 62 బ్యాంకు అథారిటీలు వద్ద ఉన్నాయని తెలిపారు.ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఆయుధాలు కలిగి ఉన్నా లేదా ప్రదర్శించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గత సంవత్సరం అక్టోబర్ నెల వరకు జిల్లాలో 178 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండగా తదుపరి వివిధ కోర్టుల ద్వారా 330 వారెంట్లు చేరగా వాటిలో ఇప్పటికే 503 వారెంట్లను ఎక్సిక్యూషన్ చేయటం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా - మిగతా 2 లో

టీడీపీ మూడో జాబితాలో జిల్లా అభ్యర్థులు

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ టికెట్

- టికెట్ ఆశించి భంగపడ్డ గణపతి, మాల్యాద్రి, ఉండవల్లి, సలగల
- తెలంగాణ బీజేపీ నేతకు టికెట్ ఇవ్వటంపై కేడర్‌లో అయోమయం
- గెలిచే సీటును చేజేతులా పొగొట్టుకుంటున్నారని చంద్రబాబుపై పార్టీ కేడర్ అసంతృప్తి

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ప్రకటించిన పార్లమెంట్ అభ్యర్థుల జాబితాలో ఆసక్తిర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్న మాజీ డీజీపీ కృష్ణప్రసాద్‌ను బాపట్ల ఎంపీగా ప్రకటించటంపై సర్వత్రా చర్చ సాగుతుంది. బాపట్ల పార్లమెంట్ స్థానం గెలిచే అవకాశం ఎక్కువగా ఉంది. చంద్రబాబు స్థానికులకు కేటాయిస్తారు అనుకుంటున్న తరుణంలో స్థానికులకే కాక కనీసం రాష్ట్రంలో ఉన్న నేతలను కూడా పక్క రాష్ట్రం తెలంగాణ నుంచి మిత్ర పార్టీ బీజేపీలో కీలక పదవిలో ఉన్న కృష్ణప్రసాద్‌ను కేటాయించటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. బాపట్ల - మిగతా 2 లో

చీరాల బరిలో కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : అనుకున్నదే నిజం అయ్యింది. చీరాల నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, భాజపా పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా మద్దులూరి మాల కొండయ్య పేరును ఖరారు చేస్తూ తెదేపా అధిష్టానం మూడో జాబితాలో ప్రకటించింది.గత రెండు సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీని నియోజకవర్గంలో నడిపించే బాధ్యతను తీసుకుని, తనయుడు గౌరీ అమర్‌నాథ్ సహకారంతో పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను చీరాల నియోజకవర్గంలో కొండయ్య నెరవేర్చారు. నాయకత్వ లేమితో అల్లాడుతున్న శ్రేణులకు అండగా నిలిచి వారిలో భరోసా కల్పించారు.చెల్లా చెదురు అయిన తెలుగుదేశం శ్రేణులను సంఘటిత పరచి వారిలో ధైర్యాన్ని నింపారు.బాధ్యతలు స్వీకరించేనాడు అధికార గణం అడ్డంకులు సృష్టించిన స్థితి నుండి ఉద్యమాల దిశగా అడుగులు వేసేలా శ్రేణులను ఉద్యుక్తులను చేశారు.ఎప్పుడూ చివరి నిమిషం వరకు నాన్చి ప్రకటించే చీరాల నియోజకవర్గ అభ్యర్థిని అధికార వైకాపా అభ్యర్థిని ప్రకటించిన వారం రోజులలోపే తెదేపా అధిష్టానం తన పేరు ప్రకటించక తప్పని పరిస్థితిని కల్పించిన నాయకత్వ పటిమ కొండయ్య స్వంతం.తనకు చీరాల నియోజకవర్గ తెదేపా అభ్యర్థిగా అవకాశం కల్పించిన తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు,భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.జనసేన, భాజపా పార్టీల సమన్వయంతో చీరాల అసెంబ్లీ - మిగతా 2 లో

చేనేతల ఓట్లు లేకుండా గెలవగలరా

సజ్జా హేమలత

విశాలాంధ్ర - చీరాల : రాబోయే సార్వత్రిక ఎన్నికలలో చేనేత సామాజికవర్గం ఓట్లు లేకుండా గెలవగలరా అని స్థానిక టీడీపీ నాయకులు అసెంబ్లీ టికెట్ అడిగితే సన్నాసులని తిడతారా అని చీరాల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యను ఉద్దేశించి టీడీపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. సజ్జా హేమలత తన కార్యాలయంలో శుక్రవారం కొండయ్య స్థానిక చేనేత నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జా హేమలత మాట్లాడుతూ చీరాల అసెంబ్లీ టికెట్ పార్టీ అధిష్టానం కేటాయించగానే చేనేతలను చులకనగా సన్నాసులు అని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో వైస్సార్సీపిలో ఉన్న కొండయ్య చంద్రబాబును చులకనగా మాట్లాడిన సంగతి గుర్తు తెచ్చుకోవాలన్నారు.చీరాలలో స్థానిక చేనేతలకు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే అందరం కలిసి గెలిపించు కుంటామన్నారు. అత్యధికంగా చేనేతలు ఉన్న చీరాలలో చేనేతలు పోటీ చేయడానికి పనికి రారా ఎవరో ఒకరి పల్లకీలు చేనేతలు మొయ్యాలా అని ప్రశ్నించారు. చేనేతలకు టికెట్ కేటాయిస్తే అందరం సహకరించి గెలిపిస్తామని చేనేతలు కాకుండా వేరే ఎవ్వరికీ కేటాయించిన మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని నొక్కి వక్కాణించారు. కొండయ్య వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని చేనేత జాతికి క్షమాపణలు చెప్పాలన్నారు. చేనేతలను చులకనగా చూస్తే మా సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో చూపిస్తామని చీరాలే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సత్తా చూపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల ఓటర్లు చేనేతలు ఉంటే చేనేతలకు టికెట్ కేటాయించడానికి నియోజకవర్గం చంద్రబాబుకు దొరకలేదా అని ప్రశ్నించారు.కొండయ్య ఎక్కడి నుంచో వచ్చి స్థానిక నాయకులను సన్నాసులు చవటలు అని తిడుతుంటే చేనేతలు పడాలా అని ప్రశ్నించారు. చంద్రబాబు చీరాల నియోజకవర్గ అభ్యర్థిత్వంపై పునరాలో చించాలని అత్యధిక ఓటర్లను అవమానించిన కొండయ్యకు మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. అసెంబ్లీ టికెట్ కేటాయించేప్పుడు నియోజకవర్గంలో సామాజిక వర్గాల స్థితిగతులు తెలుసుకొని కేటాయించాలని మెజారిటీ వర్గాల అభిప్రాయాలతో సంబంధం లేకుండా కేటాయిస్తే మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలోమునగాల గిరిధర్, జి.ఆదిలక్ష్మి, అందగుండా నారాయణ, వెంకీ,శివయ్య,మాఘం మురళి, అరుణ్ బాబు, రాహుల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల బరిలో కొండయ్య

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాన్ని చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తామనే విశ్వాసం తెదేపా శ్రేణులు వ్యక్తం చేస్తూ కొండయ్యకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.ఆశావహులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కొండయ్యను అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తెదేపా కార్యాలయంలో పలువురు నాయకులు,పెద్ద యెత్తున మూడు పార్టీల కార్యకర్తలు కొండయ్యను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం చీరాలలోని గంగమ్మ దేవాలయం, వినాయక దేవస్థానంలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాల పట్టణంలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలు పార్లమెంట్, దర్శి పెండింగ్

(మొదటిపేజీ తరువాయి)

సమయం కూడా దగ్గరకు రావడంతో పోటీలో ఉన్న ప్రతిపక్ష, అధికార పక్షాలు ఇప్పటికే ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఒంగోలు పార్లమెంట్, దర్శి అసెంబ్లీ అభ్యర్థులు ఇంకా ఖరారుకాకపోవడంతో ఆ నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం కూడా రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రజల బాధను కళ్లారా చూశా

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : నియోజకవర్గంలోని పర్యటించి ప్రతి కుటుంబంను పలకరించి వారు ఎదర్కొంటున్న సమస్యలను కళ్లారా చూశాను ఒక్క అవకాశం ఇవ్వండి మీ సమస్యలను నా సమస్యలగా భావించి పరిష్కరిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కోరారు. పిట్లలవాని పాలెం మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు,కార్యకర్తలు దోమ నాగేశ్వర రెడ్డి నాని ఆధ్వర్యంలో సుమారు 48 మంది వైసీపీ నాయకులు,కార్యకర్తలు పిట్లలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ,జనసేన,బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశ నరేంద్ర వర్మ చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి చేరారు. వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ మీరు వేసే ఓటు మీ ఓటు మీ కుటుంబ భవిష్యత్తుతో పాటు ప్రజలందరు సంతోషం, నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం చూపుతానని అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తు పై ఓటు వేయాలని కోరారు. వైసీపీ 5ఏళ్ల పాలనలో సాగునీటి కాల్వలు,మురుగు కాల్వలలో గుప్పెడు మట్టి కూడా తీయకుండ అన్నదాతలకు సమయానికి నీరు అందించలేకపోయారన్నారు. ప్రతి పనిలో ఎక్కడ చుసిన అవినీతి మయంగా పాలన సాగించారన్నారు.మొన్నటిదాకా అవినీతి పాలనలో ఇబ్బంది పడిన ప్రజలు స్వచ్ఛమైన నిజాయతీ పాలనా చూసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని నరేంద్ర వర్మ విజ్ఞప్తి చేశారు.అవినీతి అనే పదం నా నుంచి వినకుండా నిజాయతిగా పాలన అందిస్తానని నరేంద్ర వర్మ మాట ఇచ్చారు.రాబోయే ఎన్నికల యుద్ధంలో తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,తెలుగుదేశం పార్టీ నాయకులు కళ్ళం హరినాద్ రెడ్డి,పిట్టల వేణుగోపాల్ రెడ్డి,అఫ్జల్,శ్రీధర్ వర్మ, బోలగాని నారాయణ, కనుమూరి సాంబ మూర్తి రాజు, సుభాషిణి, నియాజి,దాసరి యోహాను,వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

919 ప్రాంతాల్లో 1510 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని 332 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా పరిగణించగా 1178 పోలింగ్ స్టేషన్లను సాధారణ పోలింగ్ స్టేషన్లుగా పరిగణించ బడ్డాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బీఎస్ఎఫ్ దళాలతో కవాతు కూడా నిర్వహి స్తున్నా మన్నారు. అక్రమ నగదు,మద్యం, మాదక ద్రవ్యాలు,విలువైన లోహాలు, ఉచిత పంపిణీ సామాగ్రి వంటి వాటి మీద ప్రత్యేక నిఘా ఉంచామని అదుపు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. సమీప జిల్లాలైన పల్నాడు, గుంటూరు, ప్రకాశం సరిహద్దులలో జిల్లాలోని ప్రధాన మార్గాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 18 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 29 ఎంసీసీ బృందాలను, 164 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమన్వయంగా పనిచేస్తూ అనుక్షణం మోనిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన తక్షణమే స్పందించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 స్టాటిక్ సర్వ్ లెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క టీంలో 9 మంది చొప్పున 162 మంది రెవెన్యూ పోలీస్ అధికారులతో ఉమ్మడిగా నిరంతరం పనిచేసే విధంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఎలక్షన్ కోడ్‌కు వ్యతిరేకంగా నగదు పంపిణీ, అక్రమ మద్యం నిరోధించుటకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అదుపులో ఉంచుట కొరకు టీములు పనిచేస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి 10 నుంచి 15 పోలింగ్ స్టేషన్లను ఒక సెక్టార్‌గా ఏర్పాటు చేసి మొత్తం 164 సెక్టార్లుగా వర్గీకరించి వాటిలో ముగ్గురు పోలీస్ అధికారులతో, ఒక రెవెన్యూ అధికారి ఉండేవిధంగా సెక్టార్ ఇంచార్జ్‌లను నియమించడం జరిగిందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఇప్పటికే పెక్షన్ 107 సీఆర్.పీసీ కింద 512 కేసులలో 7684 మందిని బైండోవర్ చేయడం జరిగిందని గతంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని పెక్షన్ 110సీఆర్ పీసీ కింద 346 కేసులలో 1337 మంది వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందన్నారు. బైండోవర్ చేసినప్పటికీ ఎవరైనా కోడ్ ఉల్లంఘన చేస్తే నియమావళి ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గత మూడు నెలల వ్యవధిలోనే పోలీస్ శాఖ, సెబ్ విభాగం సంయుక్త కార్యచరణతో పనిచేసి రూ.49,79,406 విలువ కలిగిన 12,799 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 1372 కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు.బెల్ట్ షాప్‌ల నిర్వహణ,నాటు సారా అమ్మకాలు చేస్తే తీవ్ర నేరాలుగా పరిగణిస్తామని హెచ్చరించారు. పోలీస్ శాఖ, సెబ్ విభాగం సంయుక్త కార్యచరణతో ఇప్పటి వరకు రూ.24,95,500 విలువ కలిగిన 478.7 కేజీల గంజాయిని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి కలిగివున్న, విక్రయిస్తున్న, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత 3 నెలలలో జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టుల ద్వారా 2 కోట్ల 35 లక్షల రూపాయల నగదును సీజ్ చేసి ఐటీ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా నగదు రవాణా చేస్తే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా కోడిపందాలు, పేకాట, వంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి రూ.7,83,890 సీజ్ చేయటం జరిగిందని తెలిపారు. 2019 సంవత్సరంలోని సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 119 కేసులు నమోదు చేసి 3,878 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.18,31,989గా ఉందన్నారు. రూ.1,08,28,950 నగదును సీజ్ చెయ్యడం జరిగిందన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేవలం గడిచిన మూడు నెలల్లోనే రూ.2,44,95,890 నగదు సీజ్ చేశామని,గత ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 230శాతం అధికంగా నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.అక్రమ మద్యం,నగదు పంపిణి,మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు,ఉచిత పంపిణీ సామాగ్రి వంటి వాటి మీద నిరంతర సోదాలు జరుగుతూనే ఉంటాయన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 100,112లకు కాల్ చేసి,(లేదా) స్టేషన్ ఎస్.హెచ్.ఓకి గాని సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ టికెట్

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ టికెట్ ఆశించిన దారాళంగా డబ్బు ఖర్చు పెట్టిన దగ్గుమళ్ల ప్రసాదరావుకు చిత్తూరు ఎంపీగా ప్రకటించారు. మారో వైపు బాపట్ల ఎంపీ టికెట్‌పై ఆశ పెట్టుకున్న తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పోలీస్ అధికారి అద్దేపల్లి గణపతి, మాజీ ఎంపీ శ్రీరాంమాల్యాద్రి, సలగల రాజశేఖర్‌బాబులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. వైసీపీని వీడి బహిష్కరణకు గురై టీడీపీలో చేరిన ఉండవల్లికి చంద్రబాబు అవకాశం కల్పిస్తాడు అనుకుంటున్న తరుణంలో ఆనుకోని పరిణామం జరగటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. దీంతో ట్విట్టర్ వేదికగా శ్రీదేవి చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఎవరు ఎలాంటి వారో అర్థమైందని రాజకీయాలు ఎలా ఉంటాయో తెలిశాయని ఆమె ట్వీట్ చేశారు. మరోవైపు పోలీస్ అధికారి అద్దేపల్లి గణపతి టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉద్యోగాన్ని సైతం వదులుకుని ముమ్మర ప్రయత్నాలు చేస్తే నీ పేరే వస్తుందని పార్టీలో ఉన్న ముఖ్యనేతలు రెండు రోజుల క్రితం వరకు చెప్పుకోచ్చారని తీరా చంద్రబాబు ఇలా ప్రకటన చేయటంపై నిరాశకు గురయ్యారు. గణపతి పార్లమెంట్ పరిధిలో పలు నియోజకవర్గాల్లో యువతలో కొంత ఉత్సాహాన్ని నింపి టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. మరోవైపు మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి బాపట్ల ఎంపీగా పోటీ చేసి గత ఎన్నికల్లో ఓటమి చెందిన ఈ సారి ఎన్నికల్లో సీటు కేటాయిస్తారని ఆశగా ఉండగా అతన్ని సైతం పక్కన బాబు పక్కన పెట్టాడు. బాపట్ల జిల్లా కేంద్రంగా స్థానికుడి ఉన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్‌బాబు ఈసారైనా దక్కుతుందని ఆశగా ఎదురు చూసిన నిరాశే మిగిలింది. వీరితో పాటు ఎస్సీ సెల్ నాయకుడు ఎంఎస్ రాజు తీవ్ర ప్రయత్నాలు చేసిన బాపట్లలో పలువురితో సీటు నాదే వచ్చేస్తున్నా రెడీగా ఉండండని మాట ఇచ్చాడని అతని పేరు దరిదాపుల్లో కూడా లేకపోవటం ఎంఎస్ రాజుకు భంగపాటుకు గురి చేసింది.

- బాపట్ల జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండగా గత ఎన్నికల్లో జగన్ గాలిలో కూడా నాలుగు అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. అటువంటి స్థానంలో బాపట్ల పార్లమెంట్ సీటు టీడీపీ కైవసం చేసుకుంటుందనే తరుణంలో కృష్ణప్రసాద్‌కు టికెట్ కేటాయించి బాపట్ల సీటును చంద్రబాబు వైసీపీకి ఇవ్వబోతున్నాడని టీడీపీ కేడర్ చర్చించు కోవటం కొసమెరుపు. మరోవైపు ఆయా అసెంబ్లీ అభ్యర్థులు సైతం కృష్ణప్రసాద్‌కు కేటాయించటంతో తమ భవిష్యత్తం ఎలా ఉంటుందో అని డైలమాలో పడ్డారు.

కొమరోలులో పకడ్బందీగా 'పది' పరీక్షలు

విశాలాంధ్ర-కొమరోలు : మండల కేంద్రమైన కొమరోలులోని సర్వెల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శుక్రవారం మ్యాథ్స్ పరీక్షకు 170 మంది విద్యార్థులు హాజరయ్యారని సెంటర్ చీఫ్ సూపర్ ఇంటెండెంట్ మొర్రి పిచ్చయ్య తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు టి. రవికుమార్, యం. శ్రీనివాసులు పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సెంటర్ చీఫ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. మ్యాథ్స్ పరీక్షకు నలుగురు విద్యార్థులు గైహాజరయ్యారని మొర్రి పిచ్చయ్య తెలిపారు.

పర్చూరు పంచాయతీకి డస్ట్‌బిన్‌లు అందచేత

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ అధ్వర్యంలో పర్చూరు పంచాయతీ అధికారులకు శుక్రవారం రోటరీ అనుబంధ సంస్థ సపోర్ట్ ఆర్థిక సహకారం రూ.70 వేలతో 80 డస్ట్‌బిన్‌లను అందచేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యద ర్శులు శ్రీనివాస రావు, సదానందరెడ్డి, ప్రతినిధులు కోట శ్రీనివాసరావు, పాబోలు ఉదయ భాస్కర్, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, పోలిశెట్టి చంద్రం, ఏవీ కృష్ణ, పాబోలు వెంకన్న, కాసా అశోక్, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఆంజనేయులు ఉన్నారు.

బీసీలకు సామాజిక న్యాయం టీడీపీకే సాధ్యం

విశాలాంధ్ర-పర్చూరు: రాష్ట్రంలో బీసీలకు సమాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు తెలిపారు. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలో చీరాల టీడీపీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య యాదవ్‌ను ఎంపిక చేయటం హర్షం వ్యక్తంచేస్తూ..స్థానిక పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంపిణీ చేశారు. నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు ప్రాధన్యం ఇస్తున్నందుకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెంనాయుడు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావుకు ధన్యవాదములు తెలిపారు. టీడీపీ నాయకులు మానం హరిబాబు, ఏవీ కృష్ణ, నూతలపాటి ఇస్రాయేలు, షేక్ గౌస్, గనిపిశెట్టి కోటేశ్వరరావు, గ్రంధి రాజేంద్ర, హైటెక్ సుభాని, చేజర్ల శ్రీనివాస్, షేక్ దరియా హుస్సేన్ ఉన్నారు.

అల్లూరయ్యకు ఘన నివాళులు

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గుర్రం అల్లూరయ్య అకాల మృతికి చింతిస్తూ, గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వారితో పాటు మండల టీడీపీ నాయకులు కూడా నివాళులు అర్పించారు.

చెక్ పోస్ట్ తనిఖీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వాహనాల తనిఖీ చెక్ పోస్టును అధికారులు పరిశీలించారు. మండల కేంద్రమైన నాగులుప్పల పాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు ప్రక్కన 216 జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన ఎన్నికల తనిఖీ చెక్ పోస్టును శుక్రవారం తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి ,ఎస్సై బ్రహ్మానాయుడు పరిశీలించారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆర్ ఐ ప్రమోద్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రజల్లో మనోధైర్యాన్ని నింపేందుకే పోలీసుల కవాతు

- కనిగిరి డిఎస్పీ రత్నాకరం రామరాజు

విశాలాంధ్ర-పీసీపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యాన్ని నింపేందుకే పోలీసుల కవాతు నిర్వహించడం జరుగుతుందని కనిగిరి డిఎస్పీ రత్నాకరం రామరాజు అన్నారు. శుక్రవారం పీసీపల్లి మండల హెడ్ క్వార్టర్‌లో 60 మంది సీఆర్పీఎఫ్ బలగాలతో పోలింగ్ కేంద్రాల పరిధిలో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడటమే తమ లక్ష్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహించామని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో భాగంగా కనిగిరి చేరుకున్న సీఆర్పీఎఫ్ బలగాలతో పట్టణాలలో మండల కేంద్రాల్లో సమస్యాత్మక గ్రామాలలో పోలీసుల కవాతు నిర్వహించి ఓటర్లలో మనోధైర్యాన్ని నింపామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఎటువంటి కేసులు నమోదైనా ఆ కేసులు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయని తెలిపారు. బంగారు భవిష్యత్తు కలిగిన యువకులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలని మంచి ఉద్యోగాలు సంపాదించుకునేలా ఉన్నతమైన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని కోరారు. డీఎస్పీ రత్నాకరం రామరాజు వెంట కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వర్లురావు పిసిపల్లి ఎస్సై టి రమేష్ బాబు హనుమంతునిపాడు ఎస్సై శివ నాగరాజు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సువిధ పోర్టల్ ద్వారా అనుమతి పొందాలి

- తహసీల్దార్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ,ప్రతినిధులు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహణ, మైకు అనుమతికి ఆన్‌లైన్ ద్వారా సువిధ పోర్టల్‌లో 48 గంటలు ముందుగా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారికి దరఖాస్తు చేసుకొని అనుమతి పొందే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. చీర్వానుప్పలపాడు, అమ్మనబ్రోలు, వినోదరాయుని పాలెం ,దాసరి వారి పాలెం, కనపర్తి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, త్రాగునీరు, ర్యాంప్, మరుగుదొడ్లు, పోలింగ్ కేంద్ర భవన స్థితిగతులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ ఐ ప్రమోద్, వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆటోలకు సీరియల్ నెంబర్లు పంపిణీ

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలో ట్రాఫిక్ నియం త్రించేందుకు ఆటోలకు సీరియల్ నంబర్లు,డ్రైవర్లకు ఐడి కార్డులు పంపిణీ చేస్తున్నామని చీరాల ఒకటవ పట్టణ సీఐ శేషగిరిరావు అన్నారు.శుక్రవారం చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సిఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో 100 ఆటోలకు సీరియల్ నెంబర్లు, డ్రైవర్లకు ఐడి కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఒకటవ పట్టణ సిఐ శేషగిరిరావు మాట్లాడుతూ చీరాల ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆటోలకు సీరియల్ నెంబర్లు పంపిణీ చేశామన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు.ఆటో డ్రైవర్లు ఎప్పుడూ యూనిఫాంలో ఉండాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు జాగ్రత్తగా చేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు ఒకటవ పట్టణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

- విద్యుత్ ఈఈ సయ్యద్ అబ్దుల్ కరీం

విశాలాంధ్ర-ముండ్లమూరు : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలలకు నిరంతరాయంగా విద్యుత్‌ను విద్యుత్‌ను అందించాలని దర్శి డివిజన్ విద్యుత్ ఈఈ సయ్యద్ అబ్దుల్ కరీం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలలకు విద్యుత్ అందించాలన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి పునరుద్ధించాలన్నారు. వ్యవసాయానికి పగలు 9 గంటల పాటు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ను పరిశీలించి మరమ్మతులు ఏమైనా ఉంటే సరిచేయాలని సిబ్బందికి సూచించారు. ఏ ఈ ఎస్ వీరబ్రహ్మం, సబ్ ఇంజనీర్ కే ఇమ్మానియేల్ బాబు, లైన్ మాన్ పుప్పగిరి ఆంజనేయులు. ఎస్కే మాసూం మస్తాన్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాంచ్ న్యాయ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు: గడిచిన పది సంవత్సరాలలో ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం ఈ రాష్ట్రంలో టిడిపి వైసిపి ప్రభుత్వాలు ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేశాయని ఈ దేశానికి మరియు ఈ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే భవిష్యత్తు భరోసా ఇవ్వగలదని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బి ఆర్ గౌస్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాబోయే ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన పాంచ్ న్యాయ పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలలో బిజెపి ఈ దేశంలోని యువతను, రైతులను, మహిళలను, శ్రామికులను, బడుగు బలహీన వర్గాలను దగా చేసి మతాల పేరు చెప్పి పబ్బం గడుపుకోవటం తప్ప ఈ దేశానికి కానీ, ఈ రాష్ట్రానికి కానీ చేసింది ఏమీ లేదని, అదేవిధంగా ఈ రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలైన వైసీపీ, టిడిపిలో తమ వ్యక్తిగత ఉనికిని చాటుకోవడానికి తాపత్రయపడ్డాయి తప్ప ఈ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ రోజు నిజాయితీగా పోరాటలేదు అని అన్నారు. మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయలు కేటాయిస్తారని, బడుగు బలహీన వర్గాలకు సంబంధించి రిజర్వేషన్ సీలింగ్ను తీసివేస్తారని, పై విషయాల్ని గమనించి ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, ఒంగోలు నగర అధ్యక్షుడు రాయపాటి గిడ్యోన్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ సుభాన్, దండుప్రోలు ప్రసాద్, కల్లూరు వెంకటేశ్వర్లు, బచ్చు అనిల్ కుమార్, గుత్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలం కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ నిర్మలదేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో మంచి వ్యక్తులను ఎన్ను కునేందుకు ఓటు ఆయుధమని పేర్కొన్నారు. ర్యాలీలో ఎంపీడీవో రాజ్ కుమార్, ఏపీఓ మంత్రు నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్, అసిస్టెంట్లు, యూత్ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-తర్లుపాడు : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేటి నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా మండల పరిధిలో ఎక్కడైనా ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తర్లుపాడు మండల ఎస్సై వేముల సుధాకర్ పాత్రికేయులతో అన్నారు. మండలంలో యువత వినోదాలకు పోయిబంగారు లాంటి జీవితాలను చెడగొట్టుకోవద్దని అన్నారు. ఇప్పటికే మండలంలో బెట్టింగ్ రాయలపై ప్రత్యేకమైన నిఘాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువత బెట్టింగ్లో ఇరుక్కుని బంగారం లాంటి జీవితాలను నాశనం చేసు కోవద్దని హితవు పలికారు. యువత రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఎస్సై వేముల సుధాకర్ పిలుపునిచ్చారు.

కొండయ్య యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన రంగ సాయి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : చీరాల నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంఎం కొండయ్య యాదవ్ ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముప్పా రంగ సాయి యాదవ్ ఎం ఎం కొండయ్య యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూముల పరిశీలన

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఏఎంసీ మార్కెట్ గోదాముల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమును ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ శుక్రవారం పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈవీఎంలను భద్రపరచటానికి ఏర్పాట్లను పరిశీలించారు. ఏయంసి కార్యాలయంలో ఉన్న సౌకర్యాలు, పరిస్థితులను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు.

జాకీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

- ముఖ్య అతిథులుగా

ఎమ్మెల్యేలు కేపి,అన్నా, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్‌లు

విశాలాంధ్ర-మార్కాపురం : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం కంభం పట్టణంలో వైసిపి మైనారిటీ నాయకులు మాజీ జడ్పీటిసి జాకీర్ మరియు వారి సోదరుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్, బిసి బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పిఎల్‌పి యాదవ్, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ మక్బూల్ భాషలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కెపి, అన్నాలు మాట్లాడుతూ శాంతికి, పవిత్రమైన ప్రేమకు, సహనానికి ప్రతీక రంజాన్ మాసమని అన్నారు. ఇస్లాం అనేది ఒక మతం కాదని, అది విశ్వ మానవాళి మనుగడకు అవసరమైన ఒక స్వచ్ఛమైన జీవన విధానం అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎదుటివారిని ప్రేమిస్తూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ సమాజంలో ఐక్యంగా మెలగాలని వారు ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లా బోధనలు శాంతికి వరమత సహనానికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యేలు కేపి నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబులు అన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు

పువ్వాడి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-పామూరు : వైసిపి ఐదు సంవత్సరముల కాలంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వర్గాల ప్రజలకు మేలు జరిగే సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు మ్యాని ఫెస్టోలో ప్రవేశపెట్టడం జరిగిందని పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలములోని నుచ్చుపొద పంచాయితీ తిరగల దిన్నె గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంను పెద్ద ఎత్తున నిర్వహించారు. పువ్వాడి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కనిగిరి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని మన ప్రాంతంలో వలసల నివారణకు కృషి చేద్దామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ యమ్.పి.పి గుంటుపల్లి దశరథ రామయ్య, జిల్లా టీడీపీ నాయకులు యారవ ప్రసాద్‌రెడ్డి, యస్‌డి అమీర్ బాబు, క్లస్టర్ ఇంఛార్జ్ గుంటుపల్లి శ్రీను, దేవరపు మాల్యాద్రి, పువ్వాడి వెంకట్, గ్రామ టిడిపి అధ్యక్షుడు అరేకొండ హరిప్రసాద్, బూత్ ఇంఛార్జ్ ఆవుల రమణమ్మ, మాజీ సర్పంచ్ మల్లెబోయిన గురుబ్రహ్మం యాదవ్, నాగవేణి, ఆవుల సుబ్బయ్య, స్థానిక టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎంపీపీ దంపతులు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బుంగాయ పల్లె (రామవారిపల్లె) గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా రామస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కామూరి అమూల్య, తాటిచెర్ల ఎంపిటిసి శ్రీనివాసులురెడ్డి దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను పూజా కార్యక్రమాలు నిర్వహించి ఎంపీపీ దంపతులు ప్రారంభించారు. మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భక్తులకు ట్రస్ట్ చైర్మన్, అన్నదాత, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు కామూరి రమణారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైసీపీని వీడిన మాజీ సర్పంచ్, ముఖ్య నాయకులు

విశాలాంధ్ర-గిద్దలూరు : అర్ధవీడు మండలంలో తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం, పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చేగిరెడ్డి సుబ్బారెడ్డి గారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 60 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అశోక్‌రెడ్డి టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో అర్ధవీడు మండలంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్ రెడ్డి గారికి అత్యధిక మెజార్టీ తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన ముఖ్య నాయకులు మరియు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఎన్నికలలో సద్వినియోగపరచుకోవాలని ఎంపీడీవో, ఏపీవో కోరారు. శుక్రవారం మండలంలోని అంబేద్కర్ సెంటర్ నందు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఇటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటును వినియోగించుకొని ప్రజా వ్యవస్థలో భాగస్వామ్యం కావాలని కోరారు ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామూరులో పోలీస్ కవాత్

విశాలాంధ్ర-పామూరు : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, పట్టణంలో 144 సెక్షన్ విధించడమైందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతుందని, అభద్రత భావానికి గురికాకుండా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలని శుక్రవారం సాయంత్రం డి.ఎస్.పి, రామరాజు, సిఐ రామనాయక్, ఎస్ఐ సైదుబాబులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు పట్టణంలోని ప్రధాన వీధులలో పోలీస్ కవాత్ నిర్వహించారు.

సొంత గూటికి ..మాజీ ఎంపీటీసీ

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని కొంగలవీడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలా సుంకన్న సొంత గూటికి చేరుకున్నాడు. గురువారం రాత్రి వైసిపిలో చేరిన సుంకన్న తిరిగి శుక్రవారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.

ఆదరించండి అండగా ఉంటా

కనిగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : రేపు జరగబోయే ఎన్నికల్లో వైయస్ఆర్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి అండగా ఉంటానని తనని ఆదరించాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. శుక్రవారం సీఎస్‌పురం మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని పెద్దగోగులపల్లి, అగ్రహారం, చింతపూడు, కంభంపాడు, పెదరాజుపాలెం పంచాయితీలలో దద్దాల నారాయణ యాదవ్ ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందాలంటే తిరిగి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. తనను గెలిపిస్తే కనిగిరి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను తీరుస్తానని అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వైసీపీ అభ్యర్థి నారాయణ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం, వెలిగండ్ల జడ్పీటీసీలు మేకల శ్రీనివాస్ యాదవ్, గుంటక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, షేక్ బుజ్జి, ముత్యాల నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శేఖర్, శ్రీనివాసులు, కటికల వెంకటరత్నం, ఎంపీటీసీ తిరుపతిరావు, దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడిమాల నారాయణరెడ్డి, చిన్న ఆంజనేయులు రామసుబ్బయ్య, అశోక్, సంగిశెట్టి వాసు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

300 కుటుంబాలు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి టీడీపీ నుంచి వైసీపీ లోకి చేరుతున్నారని నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. దోర్నాల మండలం నుండి బీజేపీ నాయకులు సింగా ప్రసాద్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల నుండి టీడీపీ, జనసేన పార్టీల నుంచి 100 కుటుంబాలు, మొత్తం 300 కుటుంబాలు వైసీపీలో చేరారు. యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్, మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

50 మంది టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని వెదుళ్ళపల్లి,కొత్త పాలెం గ్రామల నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 50మంది మండల తెదేపా మాజీ అధ్యక్షులు కావూరి శ్రీనివాస రెడ్డి, వెదుళ్ళపల్లి పార్టీ ప్రెసిడెంట్ కుంచాల సుబ్రహ్మణ్యం రెడ్డిల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబ శివరావు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కాముల సాంబ శివరావు, వేదుళ్ళపల్లి బూత్ కన్వీనర్ షేక్ చాంద్ భాష, కావూరి సింగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ నాయకుడు దద్దాలను ఎమ్మెల్యేగా గెలిపించండి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా మరియు మన కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మరియు హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ ప్రజాసేవ నాయకుడు డాక్టర్ దద్దాల నారాయణను ఎమ్మెల్యేగా అత్యధిక భారీ మెజార్టీతో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించుకుందామని మండల మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డిలు కలసి మండల పరిధిలోని శుక్రవారం తురకపల్లి పంచాయతీ నందు ప్రచారంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోన గెలుపు బాపట్ల అభివృద్ధికి మలుపు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నియోజకవర్గ ప్రజలందరూ ఎన్నికల్లో కోన రఘుపతిని ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని కర్లపాలెం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరుబోయిన సుబ్బారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వైసీపీ నుంచి పోటీ చేయుచున్న కోన రఘుపతిని గ్రామ పెద్దలతో కలిసి కోనా నివాసంలో ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలు,గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా జరగబోయే ఎన్నికల్లో కోన రఘుపతి ఎమ్మెల్యేగా విజయం సాధించాలని ఆయన స్పష్టం చేశారు.కోన గెలుపు బాపట్ల జిల్లాను మరో మెట్టుకు తీసుకువెళుతుందని ఇది నియోజకవర్గ ప్రజలందరూ గమనించాలన్నారు. రఘుపతిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎల్లావుల ఏడుకొండలు, సర్పంచ్ యల్లావుల నాని, గిరి, గుడారి, ఉపసర్పంచ్ ముసలయ్య, పందరుబోయిన శ్రీనివాసరావు, యారం బాబురావు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు తాగునీటి వసతి ఏర్పాటు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి దుర్గం మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థిని విద్యార్థులకు త్రాగునీరు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలిక ఉన్నత పాఠశాల, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చింతలపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ విద్య అనేది సమాజంలో గౌరవాన్ని సమాజం పట్ల అవగాహనాన్ని పెంపొందిస్తుం దని అన్నారు. అలానే తోటి వారికి చేయూతన అందించే అలవాటును ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని, నేటి విద్యార్థులు రేపటి ఉన్నత స్థాయిలోని అధికారులుగా మనం వారిని సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం మెకానిక్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, సెక్రటరీ, సభ్యులు ఎం ఆదాం బేగ్, ఓబులేసు, సుధీర్ బాబు, శ్రీనివాసులు, ఫరుక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చీఫ్ ఎంఈఓ నారాయణరెడ్డి, అంజనీదేవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

హనుమంతరావుకు ఘననివాళి

విశాలాంధ్ర - యద్దనపూడి : ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రివర్యులు కీ.శే స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు 27వ వర్ధంతి వేడుకలను యద్దనపూడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, గొట్టిపాటి భరత్,గొట్టిపాటి కమల్ కిషోర్,హనుమంతరావు ఘాట్ వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన మంత్రి పదవికి వన్నెతెచ్చిన నాయకుడు అని, నీతి నిజాయితీతో పని చేసి ఎంతో మంది మన్ననలను పొందిన వ్యక్తి అని, గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశా రన్నారు. యద్దనపూడి నాయకులు పెరవల్లి శ్రీనివాసరావు, శ్రీరామ్ మూర్తి, శానంపూడి చిరంజీవి, చల్లగుండ్ల సుబ్బారావు, గొట్టిపాటి కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

స్వామిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మన గ్రామానికి మన సత్యన్నా కార్యక్రమాన్ని రెండో రోజు కూడా నిర్వహించారు. భాగంగా అనంతవరం, వెలగపూడి, జయవరం, కాకుటూరి వారి పాలెం, జమ్ములపాలెం, పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీ, బీసీ కాలనీ, చెల్లెమ్మ తోట, నాయుడు పాలెం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, మాగుంట రాఘవరెడ్డి హాజరయ్యారు. కార్యకర్తలను ఉద్దేశించి దామచర్ల సత్య మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ మేనిఫెస్టోను చేర్చే బాధ్యత కార్యకర్తల దేనిని అన్నారు. వచ్చే ఎన్నికలలో కొండేపి నుండి ఎమ్మెల్యేగా డోలా బాల వీరాంజనేయ స్వామిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు అంతేకాకుండా ఎంపీగా మాగుంట రాఘవరెడ్డిని కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. మాగుంట రాఘవరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు ఎంపీగా నన్ను కొండేపి ఎమ్మెల్యేగా డాక్టర్ బాల వీరాంజనేయ స్వామిని సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఇద్దరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ధర్నాసి బ్రహ్మానందం, కస్తూర్హి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవితను చిధిమేస్తున్న జగన్ డ్రగ్ మాఫియా

- విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చారు
- డ్రగ్స్‌పై సమగ్రవిచారణ జరపాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని

విశాలాంధ్ర-ఒంగోలు : టీడీపీ హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో నెం.1 స్థానంలో ఉన్న ఏపీని జగన్ రెడ్డి.. గంజాయి, డ్రగ్ రవాణాలో నెం.1 స్థానానికి చేర్చాడని ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పత్రికా ప్రకటన ద్వారా విమర్శించారు. ఈ సందర్భంగా నూకసాని మాట్లాడుతూ విశాఖను స్టేట్ క్యాపిటల్ గా మారుస్తానని చెప్పిన జగన్.. డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారు అని, దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలోనే దొరుకుతున్నాయి అని అన్నారు. వచ్చే ఎన్నికలలో

గెలవడం కోసం ప్రభుత్వమే డ్రగ్స్ రప్పించిందా అనే అనుమానాలు కలుగుతున్నాయని నూకసాని అన్నారు. విశాఖ పోర్టులో తనిఖీలకు వచ్చిన సిబిఐ, కస్టమ్స్ అధికారులను కంటైనర్ తెరవకుండా ఆపడానికి పోలీసులు ఎందుకు ప్రయత్నం చేశారని ఆయన ప్రశ్నించారు. డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సమయంలో స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రతిఘటించారని సీబీఐ అధికారులు తమ ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు .తాడేపల్లి ప్రమేయం లేకుండా సీబీఐ అధికారుల్ని స్థానిక పోలీసులు అడ్డుకోగలరా, బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్ రెడ్డి తన అధికారులను పంపారా? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం మాఫియాతో ప్రాణాలు నాశనం చేశారు. ఇప్పుడు గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని డ్రగ్స్ కేపిటల్ గా మారుస్తున్నారని అన్నా రు.విశాఖ తీరానికి చేరిన కంటైనర్ డ్రగ్స్ ను చూ స్తుంటే చిన్న విషయం కాదని, చేపల మేత తయా రీలో వినియోగించే డ్రైఈస్ట్ పేరుతో దిగుమతి చేసుకున్న కంపెనీ వ్యవహారాలు వెనుక ఎవరు న్నారు, దీనికి కారకులు ఎవ్వరో ఆ సంస్థకు యజ మానులెవ్వరో బయటకు తీయాలని బాలాజీ డిమాండ్ చేశారు.

అంకాలమ్మవీధిలో నీటి ఎద్దడి

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని అంకాలమ్మ వీధిలో నీటిఎద్దడి నెలకొని ఉంది. శుక్రవారం పట్టణ ఉపసర్పంచ్ వేదాల వెంకట సాయి కిరణ్ ఆ ప్రాంత వాసులతో కలిసి బోర్ వేయించుటకు అనుకూల ప్రదేశాన్ని పరిశీలించారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు త్వరలో పంచాయతీ తరపున బోరు వేయించుటకు కృషి చేస్తామన్నారు. ఒగురు ఏడుకొండలు మాదిరెడ్డి నారాయణరెడ్డి, శీలం గురునాథం, శ్రీకాంత్, అంకాలమ్మ వీధివాసులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో బూచేపల్లి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని వేముల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గజ్జల తిరుపతిరెడ్డి, సుబ్బులు దంపతుల కుమార్తె వధువు గజ్జల వెంకట ఈశ్వరి వివాహ కార్యక్రమానికి దర్శి మాజీ ఎమ్మెల్యే, దర్శి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి హాజరై వధువు గజ్జెల వెంకట ఈశ్వరికి అక్షింతలు వేసి ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. గజ్జల బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లగట్ల ఈశ్వరాచారి, సర్పంచుల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచి గొంది వెంకట అప్పారెడ్డి, పసుపుగల్లు ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, అంబటి చిన్న వెంకటేశ్వరరెడ్డి, దుగ్గినేని వెంకటేష్ బాబు, సోము మోసిరెడ్డి, వాసు దేవరెడ్డి, అన్నపురెడ్డి ఆదినారాయణరెడ్డి, కుమ్మిత వెంకట రెడ్డి, కుమ్మిత శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలో ఫ్లాగ్ మార్చ్ శుక్రవారం 11 గంటలకు నిర్వహించడం జరిగింది. దీంతో చీమకుర్తి సీఐ, ఎస్ఐతో పాటు పారా మిలిటరీ సిబ్బంది చీమకుర్తి టౌన్‌లో మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాబోవు 2024 ఎన్నికల్లో ప్రశాంతంగా జరగడానికి ప్రశాంతంగా జరిపించడానికి మేము ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రామతీర్థ పుణ్యక్షేత్రంలో శిద్దా మృతి

విశాలాంధ్ర-చీమకుర్తి : మండలంలోని రామతీర్థ పుణ్యక్షేత్రంలో గల ఆర్యవైశ్య అన్న సత్రంలోని బావిలో దూకి శిద్దా వెంకట కృష్ణారావు (74) మృతి చెందారు. ఈయన శిద్దా రాఘవరావుకు సొంత అన్నయ్య, మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-పామూరు : ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమ రవాణాను అరికట్టించేందుకు మండలంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం కనిగిరి ఆర్టీవో పాలపర్తి జాన్ ఇర్విన్, తిరుగలదిన్నె చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రగతి సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అవి నిరంతరాయంగా ఉంటాయని సొసైటీ సభ్యులు దేవరపల్లి అమర్ అన్నారు. శుక్రవారం ఆయన సంఘ సభ్యులతో కలిసి లూథరన్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు వృద్ధులకు వేసవి దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రముఖ అయ్యప్ప జ్యువెలర్స్ అధినేత అయ్యప్ప పంపిణీ ప్రారంభించారు. ప్రగతి సర్వీస్ సొసైటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన 'కుందూరు'

విశాలాంధ్ర-బేస్తవారిపేట : గిద్దలూరు వైసీపీ ఇన్‌ఛార్జి , ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి శుక్రవారం బేస్తవారిపేట మండలంలో ఎంపీపీ వేగినాటి ఓసూరా రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా ఆయన కోనపల్లి తిరుమలనాథ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనపల్లి, శింగరపల్లి, గలిజెరుగుల్ల, పీవీపురం, అక్కపల్లి, బసినేపల్లి, ఎంపీ చెరువు, ఖాజీపురం, పిటికాయగుళ్ళ, జేసీ అగ్రహారం, కొత్తపల్లి, కలగొట్ల, సలకలవీడు, పెద్ద ఓబినేనిపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, వేయించి తనను అత్యధిక మెజార్టీతో

గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డికి పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ లో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి బి. వెంకట రాజయ్య, మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, మాజీ కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టీవీఎస్ఎస్ శర్మ, సర్పంచులు, ఎంపీటీ సీలు, గృహ సారథులు, కార్యకర్తలు, గ్రామ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మిరప పంటలో ఆర్మచురతో అధిక దిగుబడి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : జీవాగ్రో ఆర్మచుర తెగుళ్ల మందు వాడి అధిక దిగుబడులను సాధించిన మిరప పంటలను పలు కంపెనీల ప్రతినిధులు పరిశీలించారు. ప్రముఖ పురుగుమందుల కంపెనీ జీవాగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆర్మచుర అనే తెగులు మందులు వాడిన కండ్లగుంట పరిధిలోని పలువురి రైతుల మిరప పంటలను జీవాగ్రో, ఐటీసీ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం క్షేత్రస్థాయి ప్రదర్శన చేశారు. రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జీవాగ్రో సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మిరప పంటకు సోకుతున్న తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులు సాధించేందుకు జీవాగ్రో ఆర్మచుర ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐటిసి ప్రతినిధులు కిషోర్ నాయుడు ,విష్ణువర్ధన్, జీవాగ్రో జోనల్ మేనేజర్ మురళీమోహన్, రీజినల్ మేనేజర్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో దళారుల దందాకు అడ్డుకట్ట

- బూచేపల్లి శివప్రసాదరెడ్డి

విశాలాంధ్ర-దొనకొండ: జగనన్న పాలనలో దళారుల దందాకు అడ్డుకట్ట వేసి నేరుగా లబ్ధిదారులకు సంక్షేమాలు అందించారంటూ దర్శి నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యర్రబాలెం, బాదాపురంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తమను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని శివన్న కోరారు. జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా దొనకొండ మండల ప్రజలు తమ కుటుంబాన్ని ఆదరించారని, రానున్న ఎన్నికల్లో సైతం తమ బిడ్డకు మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందించాలని ఆమె కోరారు.

ఇఫ్తార్ విందులో శివన్న: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక చిన్న మజీద్‌లో మత పెద్దలతో కలిసి శివన్న ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని స్వయంగా వడ్డించి ఆపై వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి కాపా రమణారెడ్డి, బూచేపల్లి నందిని, ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి, మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్ దేవానంద్, కర్నాటి ఆంజనేయరెడ్డి, షేక్.గఫార్, గుంటు అజయ్, యూనస్, సయ్యద్ ముజాయిద్, పి.ఇమ్రాన్‌ఖాన్, దోలా చంద్రా, గోనె జాకోబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో దామచర్ల

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు నగరంలో పలు వివాహ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. నగరంలోని 9వ డివిజన్ నందు మాచవరపు సురేష్ కుమార్తె వివాహ కార్యక్రమంలో, మండువారిపాలెం గ్రామం నందు మారెళ్ల రామకృష్ణ కుమారుని వివాహ కార్యక్రమంలో, ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ నందు మద్దినేని రమేష్ బాబు కుమారుని వివాహ కార్యక్రమంలో మాలంపాటి లక్ష్మీనారాయణ కుమార్తె వివాహ కార్యక్రమంలో దామచర్ల జనార్దనరావు పాల్గొన్నారు.

బూతుమల్లిలో పోలీసు కవాతు

విశాలాంధ్ర - వేమూరు : రానున్న ఎన్నికల నేపథ్యంలో వేమూరు ఎస్సై రాజశేఖర్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బలగాలు, పారా మిలిటరీ బలగాలు కలిసి మండలంలోని బూతుమల్లి గ్రామంలో పోలీసు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని

హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా నీలకంఠపురం సత్రం మల్లేశ్వరరావు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మామిడాల శ్రీనివాసరావు,చీరాల కృష్ణమూర్తి,జివి ప్రసాద్,డివి సురేష్, మల్లేశ్వరరావు,గుత్తి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేస్తా

- శ్రీనివాసుల నాయుడు

విశాలాంధ్ర-సింగరాయకొండ : టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తానన్ని టీడీపీ న్యాయవిభాగం జిల్లా అధ్యక్షుడు సన్నిబోయిన శ్రీనివాసుల నాయుడు తెలిపారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయితీలోని టీడీపీ నాయకులు ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం కొండెపి శాసనసభ్యులు శ్రీ డోలా బాలవీరాంజనేయస్వామి నివాసమైన నాయుడుపాలెంలో మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీ పార్టీకోసం సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం హిందు మాల అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు, చొప్పర వంశి, సురేష్, బ్రహ్మయ్య, యేసు, రాంబాబు, గోవిందు, రామక్రిష్ణ, వినయ్, పాలేటి సుధీర్, గోపి, సుబ్బారావు, రత్నం, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరు వృధాను అరికట్టాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా గిద్దలూరులోని కుమ్మరాంకట్ట వీధిలో మండల న్యాయసేవాధికార సంస్థ, గిద్దలూరు ప్యానల్ న్యాయవాదులచే న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు అక్కడ ప్రజలకు నీరు వృధా చేయరాదని మరియు భూగర్భజలాలు ఎలా వృద్ధి చేసుకోవాలో తెలియజేసారు. నీరు వృద్ధి చేయక పోతే భావితరాలవారికి చాలా ఇబ్బంది జరుగునని తెలియజేశారు. ఇతర చట్టాల గురించి కూడా న్యాయవాదులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి.ప్రకాష్,డి.సిద్దయ్య,ఎం.రంగారెడ్డి, ఎమ్. పిచ్చయ్య యాదవ్,యస్.కె.ఫాజిల్,రైడర్ బాబు,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు ,కుమ్మరాంకట్ట ప్రజలు పాల్గొన్నారు.

31 నుండి నాయకత్వ లక్షణాలపై యువతకు శిక్షణ

- ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయిలో ఈ నెల 31వ తేదీ నుండి 8 రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం తెలంగాణ ఖమ్మం జిల్లా కాస్మిక్ వాలీ పిండిప్రోలు 30 ఎకరాల విశాలమైన ప్రకృతి వ్యవసాయ క్షేత్రం ఆవరణము నందు యువతి, యువకులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ(యూత్ లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్) వై ఎల్ టి పి ఉంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా వై ఎల్ టి పి టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు 18 నుండి 35 సంవత్సరాల వయసు గల యువతి, యువకులు పాల్గొనవచ్చునన్నారు. పదో తరగతి ఆపై తరగతుల వారు పాల్గొనవచ్చు నున్నారు. ఈ శిక్షణలో గ్రామీణాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం,నాయకత్వ లక్షణాలపై, ఆర్థికాభివృద్ధిలో ఎదుగుదల, ఆరోగ్య చిట్కాలు, యుక్తి, ముక్తి, భుక్తి పై శిక్షణ ఉంటుందన్నారు. దీంతోపాటు ప్రకృతివ్యవసాయం, యోగాసనాలు ఒత్తిడి లేని జీవితం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో నైపుణ్యత సాధించిన వారికి బతుకు తెరువు కోసం వేరు వేరు శిక్షణలు ఉంటాయన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద సర్టిఫికెట్ కూడా ఇవ్వబడును. శిక్షణలో పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే యోగాసనాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉంటుంది కాబట్టి లూజు దుస్తులు ఎనిమిది రోజులకు సరిపడు వెంట తెచ్చుకోవాలన్నారు. 30 వ తేదీ సాయంత్రం కాస్మిక్ వాలీ పిండిప్రోలు ఖమ్మం చేరుకోవాలన్నారు. వివరాల 9441932390 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలను అరికట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఓటర్లను ప్రలోభ పెట్టే మద్యం, నగదు వంటి బహుమతుల పంపిణీని అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు.ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ విధానంపై ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం కలెక్టర్ చాంబర్లో సమావేశం నిర్వహించారు.నగదు,మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి నోడల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దులు,చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్,స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌ల తనిఖీలు మరింత పెరగాలన్నారు.ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, లేదా అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం విక్రయాలలో 30శాతం పెరిగితే సంబంధిత దుకాణాలు గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుండి అలాంటివి మూడు దుకాణాలు గుర్తించామన్నారు.వాటిపై విచారణ చేయాలన్నారు.నిబంధనల మేరకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశాలపై నిఘా ఉంచాలన్నారు.గడచిన ఆరు రోజుల్లో తొమ్మిది వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.వాటి విలువ రూ. 22.40 లక్షలు ఉన్నట్లు గుర్తించామన్నారు.మరోవైపు 450 కేజీల గంజాయి పట్టుకున్నామని కలెక్టర్‌కు వివరించారు.ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ కమిటీ విధానం అనుబంధంగా పని చేస్తున్న అధికారులంతా మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు.అటవీశాఖ చెక్ పోస్టులు జిల్లాలో రెండు ఉండగా,వాటి వద్ద సంబంధితశాఖ అధికారుల పరిశీలన మరింత పెరగాలన్నారు.రైళ్లు,ఆర్టీసీ బస్సులలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలోని తొమ్మిది చెక్ పోస్టుల వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు తనిఖీలు చేయాలన్నారు.అనుబంధశాఖల నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే సీజర్ మేనేజ్మెంట్ విధానం అమలులో సత్ఫలితాలు ఉంటాయన్నారు.రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు,సభలు,ర్యాలీలపై వీడియో చిత్రీకరణ పక్కాగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.ఎన్నికల ప్రచారాలలో మద్యం, నగదు పూర్తి స్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు.ఇప్పటికే జిల్లా సరిహద్దులు,చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.పోలీస్ బలగాల పనితీరు, ఇప్పటికే సీజ్ చేసిన అంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఆయా కమిటీల పని తీరును వివరించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు,జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, సీజర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి సైదానాయక్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య,17 శాఖల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన బీసీ 50 కుటుంబాలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో బేస్తవారిపేట మండలం, జేసి అగ్రహారం గ్రామానికి చెందిన ఏషబోయిన వెంకట రాముడు, గుండు వీరాంజనేయులు, దొంతర రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని 50 బీసీ ముదిరాజ్ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టిడిపి కండువా కప్పి వారిని అశోక్ రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు రాబోయే ఎన్నికల్లో బీసీలంతా తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి నియోజకవర్గంలో పసుపు జెండా ఎగరేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన రమణయ్య, నాగరాజు, శ్రీకాంత్, మురళీ, మెట్టెల రాజయ్య, కట్ట వీరాంజనేయులు, కట్ట కాశీ, కోల నారాయణ, సురేబోయిన వెంకట రమణ, వెంకటేశ్వర్లు, కిన్నెర రామకృష్ణ, శివ, గురువయ్య, వెంకటేశ్వర్లు, రాజయ్య, కాటంరాజు, రాజకృష్ణ, లక్ష్మయ్య, పల్నాటి ఆంజనేయులు, మేకల రంగ పవన్, గుండు నారాయణ, సూరబోయిన వెంకటేశ్వర్లు, బత్తుల మోహన్, కట్ట నాగార్జున, కర్ణం దుర్గాప్రసాద్, వెంకటేష్, అన్నసముద్రం నరేంద్ర, మరియు మండల టీడీపీ అధ్యక్షులు సొరెడ్డి మోహన్ రెడ్డి, చేగిరెడ్డి పోతిరెడ్డి, నర్రా వెంకటేశ్వర్ల రెడ్డి, పెద్దపోతిరెడ్డి, సూరబోయిన గురుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

30న ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బాధితుల సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు: ఎస్సీ ఎస్టీ కేసుల్లో కోర్టుల మీద కోర్టులు వేస్తూ, రిలీఫ్ మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్న కలెక్టర్, డిఆర్‌ఓల మనువాద వైఖరికి నిరసనగా ఈ నెల 30 న ఒంగోలులో రిలీఫ్ రాని బాధితుల సమావేశం నిర్వహిస్తున్నట్టు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఒంగోలు తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగేంద్ర మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ కింద నమోదయ్యే, హత్య, బలవన్మరణం, రేప్ తదితర అన్ని కేసుల్లో బాధితులకు మూడు నెలల్లో రిలీఫ్ ఇవ్వాల్సి ఉందన్నారు. దినేష్ కుమార్ కలెక్టర్గా వచ్చి రెండు సంవత్సరాలు కావస్తుందని, ఈ రెండేళ్లలో రిలీఫ్ మంజూరులో వివక్ష చూపారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో రిలీఫ్ బిల్లుల చెల్లింపుకు ట్రెజరీ ఆంక్షలు వర్తించవన్నారు.ఎస్సీ ఎస్టీ కేసుల్లో రిలీఫ్ రాని బాధితులు ఈనెల 30 ఉదయం 11 గంటలకు ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని నాగేంద్ర కోరారు.

నవదీప్‌కు పలువురు పరామర్శ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఆధ్యాపకుడు బాలాజీ వ్యక్తిగత కక్షతో కులంపేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయపడి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్న బొనిగల నవదీప్‌ను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు గుదే రాజారావు, కట్టా శ్రీనివాసరావు, పొందుగుల ప్రసాద్ రావులు పరామర్శించారు. ఆధ్యాపకుడు బాలాజీ కర్రలతో 50 దెబ్బలు కొట్టాడని చదువులు మీ కులం వారికి ఎందుకురా అంటూ చితకబాదాడని తెలిపారన్నారు. గదిలో తలుపులు వేసి మరో ఇద్దరి ఉపాధ్యాయుల సమక్షంలో కొట్టాడంటూ విద్యార్థి నవదీప్ చెప్పారన్నారు. అదేవిధంగా అధ్యాపకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాలయువసేన రాష్ట్ర అధ్యక్షులు పొందుగల చైతన్య ఘటనపై తీవ్రంగా స్పందించారు. నేటి ఆధునిక కాలంలో మీ కులం వారికి చదువులు ఎందుకురా అంటూ తన ఇష్టానుసారంగా కొట్టిన ఉపాధ్యాయుడని చూసిన ఉపాధ్యాయులను వెనకేసుకురావటం కళాశాల యాజమాన్యం అహంకారానికి నిదర్శనం అన్నారు. ఈ ఘటన మానవ హక్కుల సంఘాన్ని, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చైతన్య తెలిపారు.

వాహనాలు ముమ్మర తనిఖీ

విశాలాంధ్ర - వేమూరు : వాహనదారులు తమ వాహనాల్లో మద్యం,నగదు డబ్బు గాని తరలిస్తే ఎన్నికల నిబంధన మేరకు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. పార్టీ జెండాలు పెట్టుకుని వెళ్లే వాహనాలు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 144 సెక్షన్ అమల్లో ఉందని గ్రామ కుడళ్ళలో గుంపులుగా చేరటం రాజకీయపరమైన చర్చలు గాని జరుపకూడదన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌మరియు పర్మినెంట్ ,పిహెచ్ వర్కర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో కమీషనర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి మున్సిపల్ కార్యాలయం ద్వారా పర్మినెంట్ కార్మికులకు అందవలసిన,కొబ్బరినూనె. బట్టలు, కుట్టుకూలి, చెప్పులు,బూట్లు వంటివి ఇవ్వటం లేదని,సెలవులు అమలు కావట్లేదని, జిపిఎఫ్ అకౌంట్లు ఓపెన్ చేయాలని కోరగా కమిషనర్,సంబంధిత శానిటేషన్ సూపర్‌వైజర్ పిచ్చయ్యని,సంబంధితగుమాస్తాని పిలిచి కార్యాలయం ద్వారా పర్మినెంట్ కార్మికులకు రావాలసిన బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. అలాగే ఆప్కాస్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 16 రోజుల సమ్మె సందర్భంగా ఇస్తానన్న సంక్రాంతి కానుక రూ.వెయ్యి, హెల్త్ అలవెన్స్ రూ.6వేలు, రూ.15వేతనం కలిపి రూ.21 వేలు వేతనం, బకాయిలు వెంటనే ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ డి సర్దార్,యూనియన్ గౌరవ అధ్యక్షులు పివిఆర్ చౌదరి,నాయకుల హరికృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన 50 కుటుంబాలు

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో కేశవరాజు కుంటకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. స్థానిక నాయకులు రాయపాటి అంజయ్య ఆధ్వర్యంలో ఈ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

విశాలాంధ్ర - బాపట్ల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రకటించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ఎప్పుడైనా ఈ ఫోన్ నెంబర్ల ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ ఆడిట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ 08643 297801 నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. 1950 ఓటర్ హెల్ప్ లైన్ కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 36లో ఏర్పాటు చేశామని,08643 297802 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సి-విజిల్ యాప్ అమలుపై కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 36లో 08643 297804 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

కలెక్టరేట్ ఆవరణలోని డిఆర్‌సి హాల్లో మీడియా సెల్,సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామన్నారు.24 గంటల పాటు పనిచేసేలా 08643 297808 ఫోన్ నెంబర్ సిద్ధంగా ఉంచామన్నారు.వెబ్ కాస్టింగ్,వీడియోగ్రఫీ కొరకు డిఆర్‌సి హాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08643 297811 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,స్పష్టమైన వివరాలతో కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించవచ్చని ఆయన తెలిపారు.

'సి-విజిల్' యాప్ ద్వారా వస్తున్న

ఫిర్యాదుల పరిష్కారంపై కలెక్టర్ల పర్యవేక్షణ ఉండాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : "సి-విజిల్" యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు పరిష్కారమవుతున్న తీరును కలెక్టర్లు నిరంతరం వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సి.ఈ.ఓ) ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఎన్నికల సంబంధిత అంశాలపై శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డి.ఆర్.ఓ. శ్రీమతి ఆర్.శ్రీలత హాజరయ్యారు. ఓటర్లను ప్రభావితం చేసేలా వినియోగించే అవకాశం ఉన్న డబ్బు, ఇతర వస్తువులను సీజ్ చేసే విషయంలో ఎస్.పి.లతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సి.ఈ.ఓ. పునరు ద్ఘాటించారు. సెక్టార్ ఆఫీసర్లకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారం అప్పగించడానికి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఎం.సి.సి. నివేదికలను సమగ్రంగా ప్రతి రోజూ ఉదయం తమ దృష్టికి తీసుకురావాలని సి.ఈ. ఓ. స్పష్టం చేశారు. పెండింగ్ క్లెయిమ్స్ త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ఫారం 6 దరఖాస్తులు 5,850 ఉన్నాయన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఫారం-7 దరఖాస్తులు 884, ఫారం-8 దరఖాస్తులు 865 పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. వీటిని సత్వరమే పరిష్క రించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాగా, సెక్టార్ ఆఫీసర్లకు ఎగ్జిక్యూటివ్ మేజి స్ట్రేట్ అధికారాలు అప్పగించడానికి సంబంధించిన ప్రతిపాదనలను ఈ వీడియో కాన్ఫిరెన్స్ అనంతరం సి.ఈ.ఓ. కార్యాలయానికి కలెక్టరేట్ నుంచి అధికారులు పంపించారు. జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ కుటిలనీతికి ప్రజలే బుద్ధి చెబుతారు

☞ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం
☞ అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి
☞ ఆప్ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్

విశాలాంధ్ర-మార్కాపురం : బీజేపీ కుటిల నీతికి ప్రజలే బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, బిజెపి ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోదీ నియంతల పాలిస్తూ రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజాస్వామ్యానికే తూట్లు పొడుస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం కోర్టు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగా అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, అరవింద్ కేజ్రీవాల్‌ను, ఆమ్ ఆద్మీ పార్టీని చూసి బి.జె.పి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భయపడుతున్నారని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను ఎన్నికల సమయంలోనే అరెస్టు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల కాలంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అక్రమాలకు పాల్పడిన బి.జె.పి. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, దాని నుండి ప్రజలను మరల్చడానికి ఈ అరెస్టు జరిగిందని అన్నారు. ఢిల్లీ ప్రజలకు సుపరిపాలనను అందిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రిని అరెస్టు చేసి ఏమి సాధించలేరని ఎద్దేవ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో దేశవ్యాప్తంగా బిజెపి కుటిల బుద్ధికి ప్రజలు చెంపపెట్టు తీర్పును ఇవ్వనున్నారని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని లేకపోతే దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నల్లూరి రమణ, వేశపోగు శేఖర్, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని వద్దిమడుగు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వ్యక్తి వద్దనున్న 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని ఇరగారెడ్డిపల్లి గ్రామంలో శివారు ప్రాంతంలో కోడి పందెం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కోడి పందెం నిర్వహిస్తున్న పది మందిని హనుమంతుని పాడు మండల ఎస్సై.పులి.శివనాగరాజు తన సిబ్బందితో కలిసి రైడ్ చేసే వారి వద్ద నుండి రెండు కోళ్ళు,5 మోటర్ బైకులు, 9సెల్ ఫోన్లు, రూ. 11,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ ఏర్పాట్లపై పరిశీలన

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : ఏప్రిల్ 18 నుంచి జరిగే నామినేషన్ల ఏర్పాట్లపై మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ , ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా ట్రయల్‌రన్ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. వచ్చేనెల 18న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను నోటిఫికేషన్ విడుదల కానుంది. వచ్చే నెల 25 వరకూ నామినేషన్లను స్వీకరిస్తారు. దీనితో సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణ, ఆఫీసు కార్యాలయ ప్రాంగణం, బయట చేయాల్సిన ఏర్పాట్లపై ఆయన రెవెన్యూ అధికారులతో చర్చించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటుచేయడం. దీనితోపాటు బందోబస్తు చర్యలు ప్రత్యేక అధికారుల నియామకం తదితర అంశాలపై ఆయన రెవిన్యూ అధికారులతో చర్చించారు. ఈయన వెంట తహశీల్దార్ రవికుమార్, సబ్‌కలెక్టర్ ఆఫీసు ఏఓ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.